**294 వ అధ్యాయం**

# ٢٩٤ - بَابُ نَهْيِ الرَّجُلِ وَالْمَرْأَةِ عَنْ خِضَابِ شَعْرِهِمَا بِسَوَادٍ

# స్త్రీలయినా, పురుషులయినా తమ శిరోజాలకు నల్లరంగు వేసుకోరాదు

١٦٣٩ - عَنْ جَابِرٍ رَضِيَ اللهُ عَنْهُ قَالَ: أُتِيَ بِأَبِي قُحَافَةَ وَالِدِ أَبِي بَكْرٍ الصِّدِّيقِ رَضِيَ اللهُ عَنْهُمَا يَوْمَ فَتْحِ مَكَّةَ وَرَأْسُهُ وَلِحْيَتُهُ كَالثَّغَامَةِ بَيَاضاً، فَقَالَ رَسُولُ اللهِ: «غَيِّرُوا هٰذَا وَاجْتَنِبُوا السَّوَادَ» رواه مسلم.

1639. హజ్రత్ జాబిర్ (రజి) కథనం: మక్కా విజయంనాడు అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) తండ్రిగారైన అబూ ఖుహాఫాను (దైవప్రవక్త-సల్లం-దగ్గరికి) తీసుకు వచ్చినప్పుడు ఆయనగారి తల, గడ్డం 'సుగామా' మాదిరిగా తెల్లగా ఉన్నాయి. అది చూసి దైవప్రవక్త (సల్లం) "వీటిని మార్చుకోండి, అయితే నలుపు జోలికి మాత్రం వెళ్ళకండి" అని ఉపదేశించారు. (ముస్లిం)

*(సహీహ్ ముస్లింలోని లిబాస్, జీనత్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

'అబూ ఖుహాఫా' అనేది అబూబక్ర్ (రజి) తండ్రిగారి మారుపేరు. ఈయన అసలు పేరు ఉస్మాన్ బిన్ ఆమిర్. ఈయన మక్కా విజయంనాడు ఇస్లాం స్వీకరించారు. 'సుగామా' అనేది కొండ ప్రాంతాల్లో మొలకెత్తే ఒక మొక్క పేరు. అది చాలా తెల్లగా ఉంటుంది. అబూ ఖుహాఫా గారి తల వెంట్రుకలు కూడా బాగా తెల్లగా ఉండటం చూసి దైవప్రవక్త (సల్లం) వాటికి రంగు పూసుకోమని పురమాయించారు. అయితే నల్లరంగు మాత్రం పూసుకోరాదని తాకీదు చేశారు. దీనిద్వారా తెలిసేదేమంటే గత్యంతరం లేదనుకుంటే తప్ప తలకుగాని లేక గడ్డానికిగాని నల్లరంగు పూసుకోరాదు.